క్లుప్తంగా

ఘనంగా పూర్వాభాద్ర హోమం



పూర్వాభాద్ర హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: స్వామి జన్మనక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకుని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం పూర్వాభాద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగ శాలలో స్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ అర్చకులు మన్యుసూక్త హోమాన్ని నిర్వహించారు. భక్తులు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



పెద్దపప్పూరు: మండల ఎస్ఐగా సోమవారం నాగ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో వీఆర్‌లో ఉన్న ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల దృష్ట్యా ప్రతి గ్రామంలో నిఘా ఉంచాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

టమాటకు ప్రీమియం చెల్లించండి

గుత్తి రూరల్: గుత్తి డివిజన్ పరిధిలోని గుంతకల్లు, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి మండలాల్లో రబీ సీజన్‌లో టమాటా పంట సాగు చేసిన రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని గుత్తి డివిజన్ ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రబీలో టమాటా సాగు చేసిన రైతులు పంటలను ఈక్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. డిసెంబర్ 15 లోపు ఎకరాకు రూ.1.600 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు పంటలకు నష్టం వాటిల్లితే ఎకరాకు రూ.32 వేలు రైతులకు బీమా అందుతుందన్నారు.

ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ తెలిపారు. ఇటీవల తాడిపత్రి ఇంజినీరింగ్ కళాశాలలో టెక్ బ్లెంజ్ 2కే–24 సదస్సు నిర్వహించారు. వీటిలో కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ (సీఎస్ఈ) విద్యార్థులు హ్యాకథాన్‌లో మొదటి బహుమతిని వెంకటరాహుల్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటరాజు, శ్రీకాంత్ రెడ్డి గెలుపొందారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు టీపీఓ రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, హెచ్‌ఓడీ డాక్టర్ చిత్రలింగప్ప, ఐఐసీ సెల్ కన్వీనర్ డాక్టర్ హేమంత్‌కుమార్ యాదవ్ అభినందించారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

పెద్దవడుగూరు: కూటమి ప్రభుత్వం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అప్పేచర్ల, ఏ.తిమ్మాపురం, పెద్దవడుగూరు, దిమ్మగుడి, మిడుతూరు, విరుపాపురం తదితర గ్రామాల్లోని పాఠశాలలో సమస్యల సేకరణతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మహమ్మద్ రఫీ, వేణుగోపాల్, పెద్దన్న, కుళ్ళాయప్ప, గోవింద్, బసవరాజు, వీరాంజినేయులు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



గేట్స్ కళాశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కాలేజీ వ్యవస్థాపకుడు వీకే సుధీర్‌రెడ్డి ఏడో వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి కడపలోని పుష్పగిరి కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు పరీక్షలు చేశారు. ఇందులో 100 మందికి శస్త్ర చికిత్సలు అవసరమున్నట్లు నిర్ధారించారు. వారిని గేట్స్ కళాశాల బస్సులో పుష్పగిరి కంటి వైద్య శాలకు తరలించారు. అంతకు ముందు వీకే సుధీర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వీకే వాణి, ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్ బాషా, నాసిర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బంకులో చోరీ

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఉన్న బంకుకు ఆదివారం అర్ధరాత్రి దొంగలు కన్నం వేశారు. బంకులో ఉన్న రూ. 1000 నగదుతో పాటు సుమారు పది వేలు విలువైన సిగరెట్లు, చాకలెట్లు ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితురాలు లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శిథిలావస్థలో ఆర్టీసీ బస్టాండ్

- తరచూ పెచ్చులూడుతున్న పైకప్పు
- భయాందోళనలో ప్రయాణికులు



గుత్తి ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్ పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్టీసీ బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందోనని ప్రయాణికులు, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఒకప్పుడు గుత్తి ఆర్టీసీ బస్టాండ్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉండేది. అయితే ఆలనాపాలనా కరువై బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరువై కూలడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ముఖ్యంగా డ్రైవర్లు, కండక్టర్లు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏడాది క్రితం బస్టాండ్ పైకప్పు ఊడి పడి ఇద్దరు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఆరు నెలల క్రితం కూడా పెచ్చులూడి పడి ఒక ప్రయాణికుడు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. పైకప్పు పెచ్చులూడి పడటం నిత్య కృత్యమైంది. ఇక బాత్ రూమ్స్, టాయిలెట్లు గదులైతే పూర్తి శిథిలావస్థలో ఉన్నాయి. ఏడాది క్రితం పైకప్పు ఊడిపడిన సమయంలో తూతూ మంత్రంగా మరమ్మతులు చేయించారు.

అందుబాటులో లేని అధికారులు

గుత్తికి పూర్తిస్థాయి డీఎం కూడా లేరు. గుంతకల్లు డీఎం నారాయణస్వామి కొన్ని మాసాలు ఇన్‌చార్జ్ డీఎంగా కొనసాగారు. ఆయన రిటైర్డ్ కావడంతో ప్రస్తుతం తాడిపత్రి డీఎం శంకర్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. బస్టాండ్ గురించి పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. కనీసం వివరణ అడుదామంటే ఎవరూ అందుబాటులో లేరు. డ్రైవర్లు, కండక్టర్లు మాత్రమే అందుబాటులో ఉంటారు.వారిని అడిగితే మాకెందుకు సార్.. అని తప్పుకుంటున్నారు. ఏది ఏమైనా కనీసం బస్టాండ్‌కు మరమ్మతులైనా చేపట్టాల్సి ఉంది. గుత్తి డిపోనకు కేవలం 24 బస్సు సర్వీసులే ఉన్నా ఆదాయం మాత్రం బాగానే వస్తోంది. అయితే బస్టాండ్ గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యారు. బస్టాండ్ కూలినా, పై కప్పు కూలినా, పెచ్చులూడినా అధికారులకు మాత్రం ఏమీ కాదు. ఎందుకంటే వారు డిపోలో సేదతీరుతుంటారు. ఒక ఎంక్వైరీ అధికారి మాత్రమే నిత్యం బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తుంటారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు

మరమ్మతులు చేయించండి



బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు పెచ్చులూడుతుండడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టాలి.

–వెంకటేశ్వర రెడ్డి, సామాజిక కార్యకర్త, గుత్తి

కూర్చోవాలంటే భయం



ఒకపుడు బస్టాండ్‌కు మంచి పేరు ఉండేది. గత ఏడాది నుంచి బస్టాండ్ పాడైపోయింది. నిత్యం పెచ్చులూడుతున్నాయి. ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చొవాలంటే భయపడుతున్నారు.

–గోపాల్, వ్యాపారవేత్త, గుత్తి

కొనసాగుతున్న సీపీఎం ప్రజాపోరు



నెలగొండలో కరపత్రాలు పంచుతున్న దృశ్యం

గుంతకల్లు రూరల్/గుత్తి/శింగనమల: ప్రభుత్వానికి వ్యతిరేకంగా సీపీఎం చేపట్టిన ప్రజాపోరు యాత్ర సోమవారం గుంతకల్లు మండలంలోని నెలగొండ, పులగుట్టపల్లి గ్రామాల్లో సాగింది. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ హామీల ఆశలను చూపి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు అడుగడుగునా నిరాశనే మిగులుస్తోందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ట్రూఅఫ్ చార్జీల పేరుతో ఏకంగా రూ.20 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజల మోపిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. నిత్యవసరాల ధరలు సైతం విపరీతంగా పెరిగిపోయాయని, రేషన్ షాపుల వద్ద బియ్యం తప్ప మిగిలిన ఏ సరుకులను పంపిణీ చేయడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గుత్తి మున్సిపాలిటీలో పాటు మండల వ్యాప్తంగా సీపీఎం తలపెట్టిన ప్రజా పోరు కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మల్లికార్జున, ఫిరోజ్, మద్దిలేటి, రేవతి, కవిత, శ్యామల తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా శింగనమలలో ఈనెల 14న ప్రజా సమస్యలు పరిష్కారం కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమంను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలరంగయ్య కోరారు. సోమవారం మండలంలోని ఆనందరావుపేట, సలకంచెరువు గ్రామాల్లో ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు జయరాముడు, సుధీర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అబుల్ కలాం సేవలు మరువలేనివి



మౌలానా విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లు/గుంతకల్లు టౌన్/తాడిపత్రిఅర్బన్/గుత్తి రూరల్/పామిడి: విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం అందించిన సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు.గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్ అండ్‌బీ సర్కిల్‌లోని ఆజాద్ విగ్రహానికి మైనార్టీ నేతలు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మైనార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అంజుమన్ కమిటీ నాయకులు ఆజాద్ విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా టీడీపీ నాయకులు, సీపీఐ నాయకులు అజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. తాడిపత్రిలోని స్థానిక ఈద్గా సర్కిల్‌లో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, తహసీల్దార్ రజాక్, కమిషనర్ శివరామక్రిష్ణ, వైద్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మైనార్టీ నాయకులు ఆజాద్ విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే గుత్తి మండలం బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పామిడిలో అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు

'అన్నదాత సుఖీభవ' అందజేయాలి



గుంతకల్లులో ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు/పెద్దవడుగూరు/బుక్కరాయసముద్రం: అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకూ తక్షణమే రూ.20వేలు ఆర్థిక సహాయం ఆందజేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గుంతకల్లులోని ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎం.వీరభద్రస్వామి, రైతు సంఘ నియోజకవర్గ కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ మేరకు రైతులకు అన్నదాత సుఖీభవను అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడలు ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ నాయకులు నంద, కిషోర్, రైతులు పాల్గొన్నారు. అలాగే పెద్దవడుగూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, జిల్లా ఉపాధ్యక్షులడు వెంకట్రాముడు యాదవ్, నాయకులు నారాయణ, ఆదినారాయణ, ఓబిరెడ్డి, రంగనాయకులు, హుస్సేన్‌పీరా, సుధాకర్ గౌడ్, నాగేంద్ర, రామాంజనేయులు, అల్లాబకాస్, కిరణ్, పెద్దన్న, సుంకయ్య, ఫకృద్దిన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రతి రైతుకూ తక్షణమే రూ.20వేలు ఆర్థిక సహాయం ఆందజేయాలనిబుక్కరాయసముద్రంలో తహసీల్దార్ పుణ్యవతికి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు రామక్రిష్ణ, మర్రిస్వామి, హరిక్రిష్ణ, తిరుపతయ్య, శ్రీనివాస్, భాస్కర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇంటింటికీ చెత్త బుట్టల పంపిణీ

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 22, 23వ వార్డుల్లో సోమవారం ఇంటింటికీ చెత్త బుట్టలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, కౌన్సిలర్ లక్ష్మిరాణి , టీడీపీ నాయకులు కోనేటి గోవిందు, వేణు పాల్గొన్నారు.

సత్కార సభకు తరలిరండి

గుంతకల్లు: అనంతపురం నగరంలోని జెడ్పీ హాల్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 15న నిర్వహించే సత్కార మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్కార మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో దండోరా జాతీయ నాయకుడు ఆర్‌జే ప్రకాష్, న్యాయవాది గుడిమల్లం గిరిధర్, దండోరా వ్యవస్థాపక సభ్యుడు కృపాకర్ తదితరులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాసు, రాయలసీమ కార్యదర్శి ఎంసీ సుంకన్న, నాయకులు జయరాం, నాగప్ప, రాజేష్, రామాంజినేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి క్యాన్సర్‌పై సర్వే

యాడికి: యాడికి, రాయలచెరువు పీహెచ్‌సీల పరిధిలోని ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన సిబ్బంది ఈ నెల 14 నుంచి ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాల్సి ఉందని యాడికి పీహెచ్‌సీ వైద్యులు శ్రీరామ్ కుమార్, పరమేశ్వర సూచించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు క్యాన్సర్ స్క్రీనింగ్‌పై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఈ స్క్రీనింగ్ చేయాల్సి ఉందన్నారు. స్క్రీనింగ్ సమయంలో వ్యాధి లక్షణాలను సిబ్బంది గమనిస్తే వెంటనే పీహెచ్‌సీకి పంపించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చిన వారికి వైద్యులు అవసరమైన పరీక్షలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, సీహెచ్ఓ జుబేదాబేగం, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, సూపర్వేజర్ రాం ప్రసాద్ గౌడ్ ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ వినోద్‌కుమార్ బహుమతులు ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు.సోమవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని అనంతపురంలోని జిల్లా పరిషత్ హాల్లో అధికారులు జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొని జాతీయ విద్యావిధానంపై వక్తృత్వ పోటీల్లో పాల్గొనగా షాహిద్ అర్ఫస్ ప్రథమ స్థానం, బషీరుద్దీన్ ద్వితీయ బహుమతి సాధించారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

టపాసుల తరలింపు

యల్లనూరు: మండలంలోని గిర్రమ్మబావి వద్ద ఇటీవల పోలీసులు పట్టుకున్న టపాసులను, యల్లనూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా గోదాంలో భద్రపర్చిన స్టాకును తాడిపత్రి బాలాజీ క్రాకర్స్‌కు తరలించారు. సోమవారం సీఐ సత్యబాబు, ఎస్ఐ శ్రీరాం ప్రసాద్, ఫైర్ సిబ్బంది రంజిత్‌కుమార్, కానిస్టేబుల్ బాలరాజు తదితరులు టపాసులను ఐచర్ వాహనంలో తరలించారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయించాలి

గుంతకల్లు రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని గుత్తి ఏడీఏ వెంకటరాముడు ఫర్టిలైజర్ షాపుల యజమానులను హెచ్చరించారు. సోమవారం ఆయన ఏఓ స్వాతితో కలిసి పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కాశీ విశ్వేశ్వర ఫర్టిలైజర్ షాపులో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేనికారణంగా రూ.11,900 విలువగల ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. వినియోగదారులకు బిల్లు ఇవ్వాలని ఆయన సూచించారు.

చదరంగ పోటీల్లో సత్తా



విజేత రామారావుకు టైటిల్ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

గుంతకల్లు: కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని నేషనల్ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్ ఓపెన్ టోర్నీలో గుంతకల్లుకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తా చాటారు. టోర్నీలో 120 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఫైనల్ విన్నర్‌గా గుంతకల్లుకు చెందిన రామారావు 6/6 పాయింట్స్‌తో ట్రోఫీతోపాటు నగదు పురస్కారం అందుకున్నారు. అలాగే సెయింట్ పాల్ స్కూల్ విద్యార్థి వేద్‌నందిత్ 5/6 పాయింట్స్ సాధించి 9వ స్థానంలో నిలిచాడు. జువైరా నిజాం 14వ స్థానం, 15వ స్థానంలో ఉదయ్‌కిరణ్, 18వ స్థానంలో స్నేహిత్ ప్రతిభను చాటారు. అదేవిధంగా అండర్–7, అండ్–9 విభాగాల్లో భాష్యం స్కూల్ విద్యార్థులు దేవేశ్వర్ 4/6 పాయింట్స్, కార్తీక్ 4/5 పాయింట్స్ గెలిచి గోల్డ్ మెడల్స్ దక్కించుకున్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లిలో ఇరువర్గాల ఘర్షణలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన నరేంద్ర, రామాంజనేయులు, మరో వర్గం నారాయణ,రామాంజ నేయులు,నాగభూషణం ఆస్తి తగాదా, పొలాల గట్లు విష యంలో ఈనెల 5న ఘర్షణ పడ్డారన్నారు. దీంతో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఓటరు జాబితా విడుదల

పెద్దవడుగూరు: సాగు సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటరు జాబితా విడుదల చేశామని తహసీల్దార్ ఉషారాణి తెలిపారు. సోమవారం మండలంలో మైనర్ ఇరిగేషన్, మేజర్ ఇరిగేషన్ ఉన్న గ్రామ సచివాలయాల వద్ద ఓటర్ల జాబితా ను ఏర్పాటు చేశామన్నారు. అందులో ఎలాంటి తప్పులు ఉన్నా సంబంధిత ఆధారాలతో మంగళవారం లోపు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు బుధవారం తుది ఓటరుజాబితా విడుదల చేస్తామన్నారు. మేజర్ ఇరిగేషన్ కలిగిన దిమ్మగుడిలో 789 మంది పురుషులు, 416 మహిళా ఓటర్లు , పెద్దవడుగూరులో 856 మంది పురుషులు, 385 మంది మహిళా ఓటర్లు, పామిడి మండలం గజరాంపల్లిలో 518 పురుషులు, 211 మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. మైనర్ ఇరిగేషన్ కింద ఉన్న అప్పేచర్లలో 234 మంది పురుషులు, 125 మంది మహిళలు, చిత్రచేడు లో191 మంది పురుషులు, 79 మంది మహిళా ఓటర్లున్నారన్నారు.

పనిభారం తగ్గించండి

పెద్దవడుగూరు: విధి నిర్వహణలో పనిభారం తగ్గించడాలని మండల వీఆర్వోల సంఘం నాయకులు రమేష్‌రెడ్డి, అంజి కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో వీఆర్వోల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇతర శాఖల నుంచి వచ్చే పనుల భారం తగ్గించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఉషారాణి కి వినతి పత్రం అందజేశారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

తాడిపత్రి రూరల్: మంగళగిరిలో జరిగిన 9వ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తాడిపత్రి విద్యార్థులు ప్రతిభ చూపారని సోమవారం తాడిపత్రి మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.టోర్నమెంట్‌లో తాడిపత్రి నుంచి 20 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకుందాం

గుంతకల్లుటౌన్: ప్రజల ఆరోగ్య భద్రతతో పాటు పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించి గ్రీన్ గుంతకల్లుగా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఉదయం పట్టణంలోని 60 అడుగుల రోడ్ డివైడర్ల మధ్యలో పిచ్చిమొక్కల తొలగింపు, పూలమొక్కలను నాటే కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. రోజూ చెట్లకు నీరు పోసేలా చర్యలు చేపట్టాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. ప్రజలు ఇంటి ముంగిట మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఈ హరిక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై నేడు శిక్షణ

యల్లనూరు: మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ పంచాయతీ ప్రణాళికలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం, బుధవారం శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సోమవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో పీఆర్ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఏపీఎం, వెటర్నరీ అసిస్టెంట్ , వైద్యులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏఓలకు శిక్షణ ఇస్తామన్నారు.

13 నుంచి..

గుత్తి రూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13, 14న గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సోమవారం తెలిపారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 13న మండల స్థాయి అధికారులు, 14న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మండల కోఆప్షన్ సభ్యులకు శిక్షణ ఉంటుందన్నారు.

శైవక్షేత్రాల్లో కార్తీక శోభ

- భక్తులతో ఆలయాలు కిటకిట
- దీపాలు వెలిగించిన మహిళలు



తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శైవక్షేత్రాలన్నీ కార్తీక శోభను సంతరించుకున్నాయి. పెన్నానది తీరంలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం కార్తీక మాసం రెండో సోమవారం కావడంతో భక్తులతో కిటకిటలాడింది. మహిళలు బియ్యంపిండి, ఉసిరి, నిమ్మ, మట్టిదీపాల్లో నెయ్యి, మంచి నూనె పోసి భక్తులు దీపారాధన చేశారు. కార్తీక దీపాలు వెలిగించి భక్తి చాటుకున్నారు. సీఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయం, నాగులకట్ట, వేదగాయత్రీదేవి ఆలయం, కడప రోడ్డులోని భ్రమరాంభ మల్లికార్జున స్వామి ఆలయం, యల్లనూరు రోడ్డులోని గౌరీశంకర ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి.

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగమేశ్వరాలయం భారీగా తరలివచ్చిన భక్తులతో పోటెత్తింది. ఆలయ అధికారులు, అర్చకులు ఆధ్వర్యంలో శివపార్వతులను పల్లకీలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అన్నదాన సత్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



గుంతకల్లులోని బుగ్గ సంగమేశ్వరుడి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



గుత్తిలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గుత్తి: గుత్తిలోని కాశీ విశ్వేశ్వర దేవాలయం, నగరేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం, ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, అయ్యప్ప స్వామి ఆలయాల్లో కార్తీక పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ సభ్యులు,పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.

శింగనమల: మండలంలోని చిన్నజలాలపురం గ్రామ సమీపంలోని దొణరామేశ్వరాలయంలో సోమవారం కార్తీక మాస పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.